# తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 80 1-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## ట్యాంక్ బండ్ శివ సేవలకు ప్రభుత్వ గుర్తింపు

- మానవత్వానికి పట్టాభిషేకం..
- ట్యాంక్ బండ్ శివ కుటుంబానికి సీఎం భారీ భరోసా.!
- రూ.5 లక్షల ఆర్థిక సాయం.. వెంటనే అందజేత
- కుమారుడికి హోం గార్డు ఉద్యోగం
- ఇల్లు, స్విమ్మింగ్ పూల్‌పై సీఎం హామీ

హైదరాబాద్ నగరానికే తలమానికమైన హుస్సేన్ సాగర్ సాక్షిగా ఎంతో మంది ప్రాణాలను కాపాడి, తన పేరుకంటే 'ట్యాంక్ బండ్ శివ'గానే సుపరిచితుడైన ఒక సామాన్య హీరోకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ఆపదలో ఉన్న వందలాది మందికి పునర్జన్మ ప్రసాదించిన శివ, ప్రస్తుతం సరైన ఉపాధి లేక కుటుంబ పోషణ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో సానుకూల స్పందన లభించింది. ఈ నేపథ్యంలో శివ తన కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రిని (లేదా సంబంధిత ప్రతినిధిని) కలిశారు. తన ప్రాణాలను పణంగా పెట్టి సమాజానికి శివ చేసిన నిస్వార్థ సేవలను కొనియాడిన ప్రభుత్వం, ఆయన కుటుంబానికి భవిష్యత్తుపై పూర్తి భరోసా కల్పించింది.

2లో






## వ్యవస్థలను దిగజార్చేలా పోలీసుల తీరు

- వైఎస్సార్‌సీపీ కేడర్ ఎవరూ భయపడొద్దు
- టీడీపీ గూండాల దాడులను దీటుగా ఎదుర్కొందాం
- పార్టీ అండగా ఉంటుంది
- గురజాల వైఎస్సార్‌సీపీ నేతలకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ భరోసా

అమరావతి: రాష్ట్రంలో పోలీసుల అండతో పాలకులు గూండా రాజ్యం నడుపుతున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. టీడీపీ గూండాల దాడులను దీటుగా ఎదుర్కొందామని, వైఎస్సార్‌సీపీ కేడర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా దాచేపల్లి మండలం రామాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఆకూరి వెంకటరెడ్డిపై టీడీపీ గూండాలు చేసిన హత్యాయత్నం గురించి వైఎస్ జగన్‌కు వివరించారు. అలాగే చర్లగుడిపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలైన బీసీ సామాజికవర్గానికి(పద్మశాలి) చెందిన కాకుమాను భావనా రిషి, భువనగిరి శ్రీనివాసరావును ఫిబ్రవరిలో టీడీపీ గూండాలు హత్య చేశారని వారి కుటుంబసభ్యులు వాపోయారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వైఎస్ జగన్ స్పందిస్తూ.. వైఎస్సార్‌సీపీ కేడర్ ఎవరూ భయపడవద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మిగతా 2లో



## ఇక, ప్రతి నెల 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్'

- ఇక, ప్రతి నెల 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్'..
- మెరుగైన ప్రజారోగ్యం కోసం గ్రామ సభలు, హెల్త్ క్యాంపులు..
- ఏడాదిలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు - రూ.162 కోట్ల వ్యయం..
- 5 పిల్లర్లతో పటిష్టంగా 'ఏపీ హెల్త్ మేనేజ్మెంట్ పాలసీ'..
- సంజీవని ప్రాజెక్టుపై సమీక్షలో అధికారులతో సీఎం చంద్రబాబు..

10లో



## నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

- ఇక శాశ్వత రాజధానిగా అమరావతి
- ఇది తెలుగువారికి ఎంతో గర్వకారణం
- టిడిపి ఎంపిలు కృష్ణదేవరాయలు, కలిశెట్టి
- నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు?

న్యూఢిల్లీ, రాష్ట్ర ప్రజలకు శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. అమరావతి తీర్మానం లోక్‌సభ ఆమోదం తరవాత ఇక ప్రజల రాజధానిగా అమరావతి వెలుగొందుతుందని అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత కల్పించే



## ఇస్ఫహాన్ అణు కేంద్రంపై బాంబుల వర్షం!

- 'బంకర్ బస్టర్లు' ప్రయోగించిన అమెరికా
- అణుకేంద్రం వద్ద భారీగా మంటలు
- పేలుళ్లతో దద్దరిల్లిపోయిన టెహ్రాన్
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు
- కువైట్ చమురు నౌకలో భారీగా మంటలు
- దుబాయ్‌లో ఇద్దరు భారతీయులకు గాయాలు

## తెలంగాణలో చికెన్ షాపులు బంద్

మార్జిన్ పెంచాలని డిమాండ్

తెలంగాణ వ్యాప్తంగా సుమారు 50 వేల రిటైల్ చికెన్ షాపులు




2లో

## 'రాజకీయ రాబందులు" కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ ఆగ్రహం..

- మిడిల్ ఈస్ట్ సంక్షోభంపై కాంగ్రెస్ తీరు దారుణం..
- రాజకీయ రాబందుల్లా ప్రవర్తించారు..
- ప్రధాని మోడీ విమర్శలు..



## యుద్ధానికి త్వరలో తెర!

- సన్నిహితులతో ట్రంప్ వ్యాఖ్యలు?
- హార్మూజ్ నుంచి చమురు తెచ్చుకోండి
- నాటో దేశాలపై అధ్యక్షుని ఆగ్రహం

వాషింగ్టన్: ఇంటా బయటా తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో ఇరాన్‌పై యుద్ధానికి వీలైనంత త్వరగా తెర దించేందుకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గు



2లో

# ట్యాంక్ బండ్ శివ సేవలకు ప్రభుత్వ గుర్తింపు

ముందుగా శివ కుటుంబ ఆర్థిక అవసరాల నిమిత్తం ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించి, ఆ మొత్తాన్ని తక్షణమే అందజేసింది. కేవలం ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా, ఆ కుటుంబానికి శాశ్వత ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో శివ కుమారుడు వేణుమాధవ్‌కు 'హోం గార్డు'గా ఉద్యోగ నియామక పత్రాన్ని కూడా అందజేశారు. తన సుదీర్ఘ అనుభవాన్ని ఉపయోగించుకుని నలుగురికి ఈత నేర్పిస్తూ జీవనం సాగించేందుకు ట్యాంక్ బండ్ సమీపంలోనే ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని శివ కోరగా, ఆ దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. వీటికి తోడు, నిలువనీడ లేని ఆ కుటుంబానికి ఒక 'ఇందిరమ్మ ఇల్లు' మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరోపకారమే పరమావధిగా బతికిన శివ వంటి వ్యక్తులు ఆర్థికంగా కృంగిపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## ఇక, ప్రతి నెల 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్'

మెరుగైన ప్రజారోగ్యం కోసం అందరూ ఉద్యమంలా కృషి చేయాలని పిలుపునిచ్చారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఏప్రిల్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యాధికారులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రతీ నెల 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్' గ్రామసభలు, హెల్త్ క్యాంపులు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సంజీవని ప్రాజెక్టుపై క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం, నారావారిపల్లెలో సమర్ధవంతంగా అమలవుతోన్న ప్రాజెక్టును జూలై కల్లా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు జరపాలనే లక్ష్యాన్ని అధికారులకు సీఎం నిర్దేశించారు.వైద్య పరీక్షల ఫలితాలను వాట్సాప్ ద్వారా నేరుగా 48 గంటల్లో వారికి అందించాలన్నారు. అయితే, ఇందుకోసం 904 మొబైల్ మెడికల్ యూన్సిట్ అవసరం కానున్నాయని, రూ.162 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు వివరించగాడ ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకారం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3.14 లక్షల మంది సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ డేటాబేస్‌లో నమోదు చేసుకున్నారని అధికారులు వివరించారు. మరో వైపు వ్యక్తిగత హెల్త్ రికార్డ్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా చూడాలని సీఎం ఈ సందర్భంగా అన్నారు. భవిష్యత్‌లో వైద్య ఖర్చులు తగ్గేలా సేవలు అందించగలగాలని, ప్రివెంటివ్ హెల్త్‌పై దృష్టి పెట్టాలన్నారు. యోగా, న్యూట్రిషన్, మెడిటేషన్, ప్రాణాయామం వంటివి తప్పనిసరిగా అనుసరించడం వల్ల చాలా వరకు ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఎం చెప్పారు. సంజీవని ప్రాజెక్టు అమలవుతున్న చిత్తూరు జిల్లాలో ప్రజారోగ్యం ఏమేరకు మెరుగయ్యిందో పరిశీలించాలని సూచించారు

## 'రాజకీయ రాబందులు".. కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ ఆగ్రహం..

ఇరాన్ యుద్ధాన్ని ఆసరాగా చేసుకుని ప్రతిపక్ష పార్టీలు "రాజకీయ రాబందువులు"గా ప్రవర్తిస్తున్నాయని, గందరగోళాన్ని రెచ్చగొట్టడానికి కుట్ర పన్నుతున్నాయని ప్రధాని నరేంద్రమోడీ మంగళవారం అన్నారు. గుజరాత్‌లోని వావ్ థరద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన విపక్షాలపై విరుచుకపడ్డారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సంక్షోభాలను ప్రస్తావిస్తూ.. ప్రపంచం మొత్తం ఇబ్బందులు పడుతున్న తరుణంలో భారత్ స్థిరత్వాన్ని కొనసాగించిందని అన్నారు. కష్టసమయాల్లో కలిసికట్టుగా నిలబడాలని సూచించారు. జాతీయ ఐక్యత కన్నా రాజకీయ బతుకుదెరువు కోసం రాజకీయాలు చేయడంలో కాంగ్రెస్ ముందుందని, దేశాన్ని విభజించాని కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపించారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడానికి ప్రతిపక్షాలు చురుకుగా పనిచేస్తున్నాయని మండిపడ్డారు. దేశంలో కాంగ్రెస్ భయాన్ని, పుకార్లను సృష్టిస్తోందని అన్నారు. అధికారం కోల్పోవడం వల్లే ప్రతిపక్షాలు ఇలా చేస్తున్నాయని, ఢిల్లీలో ఏఐ సమ్మిట్ సభ్యులు నిరాశతో తమ బట్టలు తామే చించుకుంటున్నారని కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ సెటైర్లు వేశారు.

## తెలంగాణలో చికెన్ షాపులు బంద్

హైదరాబాద్: రిటైల్ చికెన్ షాపులకు ఇచ్చే మార్జిన్ పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చింది రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్. దీనిలో భాగంగా రేపట్నుంచి(బుధవారం, ఏప్రిల్ 1వ తేదీ) రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ షాపులను బంద్ చేస్తున్నట్లు వెల్లడించింది. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే లాభం (మార్జిన్) తగ్గించడంతో వ్యాపారులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని, ఈ మార్జిన్‌ను పెంచాలని డిమాండ్ చేస్తోంది చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్. గతంలో ఫౌల్ట్రి వాళ్ళు రిటైల్ షాపులకు కేజీకి 26 రూపాయలు మార్జిన్ ఇచ్చే వారని, గత 20 ఏళ్ళుగా 26 రూపాయలే మార్జిన్ ఉందని, కానీ ఇటీవల మార్జిన్‌ను16 రూపాయలకు తగ్గించారని, ప్రస్తుతం కేజీ చికెన్‌కు మార్జిన్ 30 రూపాయలు చేయాలని డిమాండ్ చేస్తుంది. అసోసియేషన్ నాయకుల చెబుతున్న దాని ప్రకారం, ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభం చాలా తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారిందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు జీవనోపాధి కొనసాగించడం సవాల్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్జిన్‌ను తక్షణమే పెంచాలని డిమాండ్ చేస్తూ, తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు నిరసన కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులు బంద్ పాటించనున్నట్లు ప్రకటించారు.

ఈ నిర్ణయం వల్ల సాధారణ వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశముంది. ముఖ్యంగా వేసవి కాలంలో చికెన్‌కు ఉన్న డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ధరలు మరింత పెరగవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు త్వరగా జోక్యం చేసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని వ్యాపారులు కోరుతున్నారు. లేదంటే ఈ బంద్ దీర్ఘకాలం కొనసాగి మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఇస్ఫహాన్ అణు కేంద్రంపై బాంబుల వర్షం!



దుబాయ్: పశ్చిమాసియాలో పరిస్థితి మరింత విషమిస్తోంది. చర్చలకు ససేమిరా అంటున్న ఇరాన్‌పై అమెరికా కన్నెర్రజేసింది. స్వీయ కాల్పుల విరమణను తుంగలో తొక్కుతూ మంగళవారం ఆ దేశంపై భారీ స్థాయి దాడులతో విరుచుకుపడింది. ఇస్ఫహాన్ నగరంలోని కీలక అణు కేంద్రాలపై బంకర్ బస్టర్ బాంబులతో దాడి చేసింది. దాంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఇందుకు సంబంధించిన వీడియోను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో షేర్ చేయడం విశేషం. శుద్ధి చేసిన యురేనియం నిల్వలను ఆ కేంద్రంలోనే ఇరాన్ దాచి ఉంచినట్టు చెబుతున్నారు! ఈ నేపథ్యంలో తాజా దాడిలో అక్కడి అణుకేంద్రానికి నష్టం జరిగిందా అన్నది తెలియరాలేదు. త్వరగా ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌లోని మౌలిక వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేస్తామని ట్రంప్ సోమవారమే హెచ్చరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజాము వేళ ఇజ్రాయెల్‌తో కలిసి టెహ్రాన్‌పైనా అమెరికా బాంబుల వర్షం కురిపించింది. పేలుళ్లతో ఇరాన్ రాజధాని దద్దరిల్లిపోయింది. నగరంలో పలుచోట్ల మంటలు చెలరేగాయి. లెబనాన్‌పైనా ఇజ్రాయెల్ భారీగా దాడులను కొనసాగించింది. వాటిలో ఐరాస శాంతి పరిరక్షక దళానికి చెందిన ముగ్గురు సిబ్బంది మరణించినట్టు సమాచారం. మొత్తమ్మీద మంగళవారం ఒక్క రోజే 21 మంది మృతి చెందినట్టు లెబనాన్ పేర్కొంది. మొత్తం మృతుల సంఖ్య 1,268 దాటినట్టు వెల్లడించింది. ఉత్తర గాజాలో కూడా ఇజ్రాయెల్ దాడుల్లో ఒక వ్యక్తి, అతని ఐదేళ్ల కుమారుడు దుర్మరణం పాలయ్యారు. అమెరికా, ఇజ్రాయెల్ నిస్సిగ్గుగా తమ మౌలిక వ్యవస్థలను లక్ష్యం చేసుకుంటున్నాయంటూ ఇరాన్ మండిపడింది. దీనికి తమ సమాధానం భయానకంగా ఉంటుందని విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి హెచ్చరించారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికాకు చెందిన టెక్ దిగ్గజ కంపెనీలపై కూడా బుధవారం నుంచి భారీగా దాడులు చేస్తామని రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. యాపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్, ఇంటెల్, ఐబీఎం, టెస్లా, బోయింగ్‌తో పాటు 18 సంస్థల పేర్లను వెల్లడించింది! తక్షణం కార్యాలయాలను వీడి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆ కంపెనీల సిబ్బందికి సూచించింది. యుద్ధం దెబ్బకు అంతర్జాతీయంగా చమురు ధరలు నానాటికీ ఎగబాకుతున్నాయి. మంగళవారం అంతర్జాతీయ మార్కెట్లో బ్యారల్ చమురు ధర 107 డాలర్లకు చేరింది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్‌అమెరికా యుద్ధానికి తెర తీసినప్పటితో పోలిస్తే ఇది ఏకంగా 45 శాతం ఎక్కువ కావడం విశేషం! మరోవైపు అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగాయి! మంగళవారం గ్యాలన్ (దాదాపు 3.8 లీటర్ల) పెట్రోల్ ధర 4.02 డాలర్లకు చేరింది. 2022 తర్వాత అమెరికాలో పెట్రోల్ ధర 4 డాలర్లను దాటడం ఇదే తొలిసారి కావడం విశేషం! ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం మొదలయ్యే నాటికి అమెరికాలో గ్యాలర్ పెట్రోల్ ధర 2.98 డాలర్లుగా ఉంది. డీజిల్ ధర కూడా గ్యాలన్‌కు 3.75 డాలర్ల నుంచి 5.45 డాలర్లకు పెరిగింది. ఇరాన్ కూడా ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై పెద్ద ఎత్తున దాడులు కొనసాగించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో దుబాయ్ సమీపంలో కువైట్‌కు చెందిన ఓ చమురు నౌకపై డ్రోన్లతో దాడి చేసింది. దాంతో నౌకలో మంటలు చెలరేగాయి. సిబ్బంది చాలాసేపు శ్రమించి వాటిని ఆర్పేశారు. ఐదు క్షిపణులు, ఏడు డ్రోన్లను కూల్చేసినట్టు కువైట్ పేర్కొంది. దుబాయ్‌లోని అల్ బదాలో ఓ ఆవాస ప్రాంతంపై జరిగిన డ్రోన్ దాడిలో శకలాలు పడి ఇద్దరు భారతీయులతో పాటు నలుగురు గాయపడ్డారు. సౌదీ అరేబియా, బహ్రెయిన్ తదితర గల్ఫ్ దేశాలు కూడా దాడుల బారిన పడ్డాయి. ఆ దేశాలతో పాటు ఇజ్రాయెల్ నగరాల్లో కూడా రోజంతా సైరన్ మోతలు విన్పించాయి. ఇరాక్‌లోని సులేమానియా యూనివర్సిటీపై ఇరాన్ డ్రోన్లతో దాడి చేసింది. హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి వసూలు చేయాల్సిన సుంకాన్ని ఇరాన్ లాంఛనంగా ఖరారు చేసింది. ఒక్కో నౌక నుంచి గరిష్టంగా రూ.19 కోట్ల దాకా వసూలు చేయనున్నట్టు తెలుస్తోంది. ఆ దేశ పార్లమెంటు భద్రతా మండలి ఇందుకు ఆమోదముద్ర వేసింది. హార్ముజ్‌పై ఇరాన్ సార్వాభౌమాధికారానికి నిదర్శనంగా ఈ చర్య తీసుకున్నట్టు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఐబీ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు ఇరాన్‌పై ఏకపక్షంగా ఆంక్షలు విధించిన దేశాల నౌకలకు హార్ముజ్ గుండా వెళ్లనివ్వబోమని పేర్కొంది. స్పెయిన్ బాటలోనే ఇటలీ కూడా అమెరికాకు షాకిచ్చింది. ఇరాన్‌పై పోరులో అమెరికా వినియోగిస్తున్న యుద్ధ విమానాలకు తన గగనతలాన్ని మూసేస్తున్నట్టు ప్రకటించింది. సిసిలీలోని తమ వైమానిక స్థావరాన్ని అమెరికా వాడుకునేందుకు కూడా అనుమతి నిరాకరించినట్టు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. సోమవారం స్పెయిన్ కూడా ఈ మేరకు ప్రకటన చేయడం తెలిసిందే.

## వ్యవస్థలను దిగజార్చేలా పోలీసుల తీరు

టీడీపీ గూండాల దాడులు, దౌర్జన్యాలను దీటుగా ఎదుర్కొందామని ధైర్యం చెప్పారు. పార్టీ లీగల్ సెల్ అవసరమైన న్యాయ సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. వ్యవస్థలను దిగజార్చేలా వ్యవహరిస్తున్న పోలీసుల తీరును వైఎస్ జగన్ తీవ్రంగా తప్పుబట్టారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఆకూరి వెంకటరెడ్డి, కాకుమాను భావనా రిషి, భువనగిరి శ్రీనివాసరావుల కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాుయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు, వేముల చలమయ్య, జంజనం తిరుపతి రావు, సైదయ్య, చెన్నారెడ్డి, షేక్ ఇమాం వలీ తదితరులున్నారు. సాక్షి, అమరావతి: భగవాన్ మహావీర్ జయంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్కే రోజా, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి, జైన్ వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మనోజ్ కొఠారి, ఏఎస్ఆర్ జేఎస్‌టీ సెక్రటరీ కుందన్ గాంధీ, కరస్పాండెంట్ ప్రవీణ్ ఫోలాముతా, ప్రవీణ్ కుమూర్ జైన్, మనోజ్ జైన్ తదితరులు పాల్గొన్నారు. 'అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం.. అనే పంచ మహా వ్రతాలను ప్రజలకు బోధిస్తూ నైతిక జీవనానికి మార్గం చూపిన మహనీయుడు మహావీర్. ఆ మహర్షి చూపిన మార్గం సదా ఆచరణీయం. మంగళవారం జైనుల ఆధ్యాత్మిక గురువు మహావీర్ జయంతి సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు' అని వైఎస్ జగన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

బిల్లును ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాజధాని రైతులకి మరింత భరోసా వస్తోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులు నమ్మకంతోనే.. రాజధానికి భూములు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను కేంద్రం అర్థం చేసుకుందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం రాజధానిని అడ్డుకోవాలని చూసిందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రాజధానికి 30 వేల ఎకరాలని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మాట మార్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చినా? రాకున్నా రాష్ట్ర ప్రజలు పట్టించుకోరని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలకు రాజధానిపై అసలు స్పష్టత లేదని విమర్శించారు. రాజధాని అమరావతికి తాము వ్యతిరేకం కాదని వైసీపీకి చెందిన సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన విషయాన్ని ఎంపీ లావు గుర్తు చేశారు. వైసీపీ నేతలు ఒక్కొక్కరు ఒక్కో విధంగా రాజధానిపై మాట్లాడుతున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు మాట ఇచ్చారని.. ఇప్పుడు దానిని నిలబెట్టుకున్నారని వివరించారు. ఏపీ పునర్విభజన చట్టంపై తాను పార్లమెంట్‌లో ఇప్పటి వరకు 20 సార్లకు పైగా మాట్లాడానని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు గుర్తు చేశారు. లోక్ సభకు రాజధాని అమరావతి బిల్లు రాబోతుందని.. ఇది ఒక ఆంధ్రుడిగా తనకు గర్వంగా ఉందని విజయనగరం ఎంపీ కె. అప్పలనాయుడు తెలిపారు. అమరావతి రాజధానిగా ఉండాలని 30 వేల ఎకరాల భూములను రైతులు ఇచ్చారని వివరించారు. 2014లో సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు ఇస్తే రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని చెప్పారు.

## యుద్ధానికి త్వరలో తెర!

(మొదటి పేజీ తరువాయి)

చూపుతున్నట్టు సమాచారం. తన సన్నిహితులతో ఆయన తాజాగా ఈ మేరకు పేర్కొన్నట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ నివేదించింది. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధిని ఇరాన్ తక్షణం తెరవాల్సిందేనని కొన్నాళ్లుగా అధ్యక్షుడు పట్టుబడుతుండటం తెలిసిందే. దాన్ని తెరిచినా, తెరవకపోయినా యుద్ధాన్ని మాత్రం ముగించేస్తానని ఆయన చెబుతున్నట్టు ఆ వార్తా సంస్థ తెలిపింది. "యుద్ధాన్ని నాలుగు నుంచి ఆరు వారాలు మాత్రమే సాగించాలని ముందే నిర్ణయించుకున్నాం. హర్మూజ్ కోసం పట్టుబడితే పోరు మరిన్ని రోజులు కొనసాగేలా ఉంది. కనుక మన ప్రధాన లక్ష్యాలైన ఇరాన్ నావికా దళాన్ని, దాని క్షిపణి నిల్వలను పూర్తిగా నేలమట్టం చేసి యుద్ధానికి త్వరగా తెర దించేస్తా" అని ట్రంప్ చెప్పుకొచ్చినట్టు పేర్కొంది. మరోవైపు సౌదీ, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ వంటి గల్ఫ్ దేశాలు మాత్రం ఇరాన్ పూర్తిగా ఓడేదాకా యుద్ధాన్ని కొనసాగించాల్సిందిగా అమెరికాను కోరుతున్నట్టు అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొంది! ఇరాన్‌పై యుద్ధంలో తమతో కలిసి రావడం లేదంటూ నాటో భాగస్వామ్య దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుర్రుగా ఉన్నారు. 'మీకు కావాల్సిన చమురును మీరే సమకూర్చుకోండి' అంటూ సోషల్ మీడియా పోస్టులో వాటిపై ఆక్రోశం వెళ్లగక్కారు. "మీకోసం మీరు ఎలా పోరాడాలో నేర్చుకోండి. అమెరికా మీకిక ఏ మాత్రమూ సాయం చేయబోదు. మీరూ మాకు సాయానికి రాలేదు కదా! చమురు కావాలంటే మీకు రెండే మార్గాలున్నాయి. మా దగ్గర పుష్కలంగా ఉన్న నిల్వల నుంచి కొనుక్కోవడం. లేదంటే సాహసం చేసి హార్మూజ్ వద్ద ఇరుక్కున్న మీ చమురు నౌకలను విడిపించుకోవడం" అంటూ బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలకు సలహా ఇచ్చారు! ముఖ్యంగా అమెరికా యుద్ధ విమానాలను తన గగనతలం గుండా వెళ్లేందుకు ఫ్రాన్స్ అనుమతించలేదంటూ మండిపడ్డారు. దీన్ని కచ్చితంగా గుర్తుంచుకుంటామని హెచ్చరించారు.





## ఆదర్శ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డికి ఘన వీడ్కోలు

- విద్యార్థుల భవితకు బాటలు వేసిన మార్గదర్శి: పీఆర్‌టీయూ నేతలు
- అట్టహాసంగా పదవీ విరమణ సన్మాన సభ

**రాజపేట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా కృషి చేస్తూ, భావి భారత పౌరులుగా వారిని తీర్చిదిద్దడంలో అహర్నిశలు శ్రమించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముప్పారపు శ్రీనివాస్‌రెడ్డి పదవీ విరమణ సభ ఘనంగా జరిగింది. రాజపేట మండలం నమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడిగా, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా ఆయన గత 14 ఏళ్లుగా విశేష సేవలు అందించారు. మంగళవారం స్థానిక వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆయన ఆత్మీయ వీడ్కోలు సభకు ఉపాధ్యాయులు, నాయకులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డి మంచికి మారుపేరని కొనియాడారు. విద్యాబోధనలోనే కాకుండా, పీఆర్‌టీయూ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అనన్య సామాన్యమన్నారు. విద్యార్థులకు నిరంతరం మార్గదర్శిగా ఉంటూ వారి ఉన్నతికి ఎంతగానో తోడ్పడ్డారని ప్రశంసించారు. ప్రస్తుతం పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన సేవలు, సలహాలు భవిష్యత్తులోనూ సమాజానికి ఎంతో అవసరమని ఆకాంక్షించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ సంఘాల నాయకులు, పాత్రికేయులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, గౌరవాధ్యక్షులు వీరారెడ్డి, మండల శాఖ అధ్యక్షులు సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శి గౌటే బాలరాజు, కార్యదర్శి వంశీధర్, గెజిటెడ్ హెచ్‌ఎంల జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్, నాయకులు ప్రభాకర్, తడక రాజు, శ్రీనివాస్‌రెడ్డి, భారతి, బావిక తదితరులు పాల్గొన్నారు.

## బసంతాపురంలో సిసి రోడ్డు పనులకు శ్రీకారం

- ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు
- ప్రారంభించిన సర్పంచి మెండు రత్నమాల



**రాజపేట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని బసంతాపురం గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం గ్రామ సర్పంచి మెండు రత్నమాల సత్తిరెడ్డి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నిధుల సద్వినియోగంతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను గడువులోగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్లపల్లి రాజు గౌడ్, వార్డు సభ్యులు మెండు ఉపేందర్ రెడ్డి, గంధమల్ల కవిత, వడ్లకొండ రాములమ్మ, ములకలపల్లి రమేష్, వడ్లకొండ మాధవి, మెండు భాస్కర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, బాలకృష్ణ, స్వామి, నరసయ్య, రాజయ్య, మహేష్ బాబు, భగవాన్ రెడ్డి, చంద్రారెడ్డి, సాయికుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో జాగ్రత్త.. దొంగలు పడే అవకాశం!

- ఆరుబయట నిద్రించే వారు అప్రమత్తంగా ఉండాలి
- ఇళ్లకు తాళాలు వేయకుండా నిర్లక్ష్యం వద్దు
- నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలి: సీఐ మన్మథ కుమార్

**చౌటుప్పల్, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** వేసవి కాలం దృష్ట్యా దొంగతనాలు పెరిగే అవకాశం ఉన్నందున చౌటుప్పల్ మండల పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మన్మథ కుమార్ సూచించారు. ఎండ తీవ్రత వల్ల చాలా మంది ప్రజలు ఇళ్ల డాబాల పైన, ఆరుబయట వరండాల్లో కుటుంబ సమేతంగా నిద్రిస్తున్నారని, ఇదే అదనుగా దొంగలు రెచ్చిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నిద్రిస్తున్న సమయంలో ఇళ్లకు తాళాలు వేయకుండా కేవలం తలుపులు దగ్గరకు వేయడం వల్ల దొంగలు సులభంగా లోపలికి ప్రవేశించి బంగారం, నగదు దోచుకెళు_న్నారని తెలిపారు. కొన్ని చోట్ల నిద్రిస్తున్న వారి మెడలో నుంచి పుస్తెల తాడులు, గొలుసులు తెంచుకుపోయే ముఠాలు తిరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. శుభకార్యాలకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరు తమ స్తోమతకు తగ్గట్టుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీ వాసులు, చిన్న చిన్న షాపుల నుంచి పెద్ద కంపెనీల వరకు నిఘా కెమెరాలను అమర్చుకోవాలని, అవి పని చేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే '100'కు డయల్ చేయాలని ఆయన కోరారు.


# యాదాద్రి ఈవో లేఖ వెనుక మతలబు ఏంటి?



- బదిలీ అయిన ఉద్యోగులపై 'ప్రేమ' వెనుక ఆంతర్యం?
- 'గుట్ట'లో మళ్లీ పాతవారికే పట్టం కట్టేందుకు స్కెచ్!
- అర్చకులను కూడా బదిలీ చేయాలంటూ నేతల డిమాండ్

**యాదగిరిగుట్ట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి దేవస్థానంలో బదిలీల పర్వం కొత్త మలుపు తిరిగింది. బదిలీపై వెళ్లిన ఉద్యోగులను తిరిగి రప్పించేందుకు ఈవో భవాని శంకర్ ఏకంగా ప్రిన్సిపల్ సెక్రటరీకే లేఖ రాయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం పారదర్శకత కోసం బదిలీలు చేపడితే, ఈవో దానికి భిన్నంగా వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. యాదాద్రి కోసం ప్రత్యేక జీవో కోరడం అంటే.. మళ్లీ పాత అక్రమాలకు ద్వారాలు తెరిచినట్టేనని విమర్శలు వినిపిస్తున్నాయి. కొండగట్టు, బాసర, వేములవాడ వంటి ఆలయాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్న నేతలు.. ఈ లేఖపై మండిపడుతున్నారు. కొందరు అధికారులు, అర్చకులు రాజకీయ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ బదిలీలు కాకుండా అడ్డుకుంటున్నారని, ఇప్పుడు ఈవో లేఖ వారిని మరింత ప్రోత్సహించేలా ఉందని అంటున్నారు. అర్చక వ్యవస్థలోనూ మార్పులు తెచ్చి, వారిని కూడా ఇతర ఆలయాలకు పంపాలని, అప్పుడే దేవస్థానాల్లో పారదర్శకత పెరుగుతుందని స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా.. నమిలలో దొంగల బీభత్సం







- ప్రయాణాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ లింగారెడ్డి


**రాజపేట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** బతుకుదెరువు కోసం వలస వెళ్లిన కూలీల ఇళ్లే లక్ష్యంగా దుండగులు రెచ్చిపోయారు. గుట్టుచప్పుడు కాకుండా తాళాలు వేసి ఉన్న ఇళ్లలోకి చొరబడి నగదు అపహరించుకుపోయారు. ఈ ఘటన రాజపేట మండలం నమిల గ్రామంలో మంగళవారం వెలుగుచూసింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. నమిల గ్రామంలోని బుడిగె జంగాల కాలనీకి చెందిన మోతే నర్సింలు, వానరాశి సమ్మయ్య, మోతే చిన్న రాములు కుటుంబాలు ఉపాధి నిమిత్తం సుమారు 45 రోజుల క్రితం ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. దీన్ని అదనుగా భావించిన దుండగులు.. కిటికీ ఊచలు, వెంటిలేటర్లు ధ్వంసం చేసి మూడు ఇళ్లలోకి ప్రవేశించారు. బీరువాలు పగలగొట్టి వస్తువులను చిందరవందర చేశారు. నర్సింలు ఇంట్లో రూ.3 వేలు, సమ్మయ్య ఇంట్లో రూ.2 వేల నగదును అపహరించారు. చిన్న రాములు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఏమీ లేకపోవడంతో దొంగలు వట్టి చేతులతో వెనుదిరిగారు. సమాచారం అందుకున్న ఎస్ఐ లింగారెడ్డి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

### విలువైన వస్తువులు ఇంట్లో ఉంచొద్దు: ఎస్ఐ

సెలవులు, ఇతర పనుల నిమిత్తం ఊర్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజపేట ఎస్ఐ లింగారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాళం వేసిన ఇళ్లపైనే దొంగలు ప్రధానంగా కన్నేస్తారని, కాబట్టి ప్రయాణాలు చేసేటప్పుడు ఇళ్లలో బంగారం, వెండి, నగదు వంటి విలువైన వస్తువులు ఉంచరాదని స్పష్టం చేశారు. బ్యాంకు లాకర్లలో గానీ, సురక్షిత ప్రాంతాల్లో గానీ భద్రపరుచుకోవాలని కోరారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లేవారు తప్పనిసరిగా ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, కొత్త వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# కంకర పరిచారు.. బీటీ మరిచారు!

- మల్లగూడెం వాసులకు తప్పని ప్రయాణ కష్టాలు
- నరకప్రాయంగా మారిన మూడు కిలోమీటర్ల రహదారి
- పనులు పూర్తి చేయాలని గ్రామస్థుల డిమాండ్



**రాజపేట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** ఆ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైందని సంబరపడాలో.. లేక వేసిన కంకరతో పడుతున్న ఇబ్బందులకు ఏడవాలో అర్థం కాని స్థితిలో మల్లగూడెం ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని పాముకుంట కాశగూడెం నుంచి మల్లగూడెం వరకు ఉన్న మూడు కిలోమీటర్ల మట్టి రోడ్డు అధ్వానంగా ఉందని గ్రామస్థులు మొరపెట్టుకోవడంతో గత, ప్రస్తుత ఎమ్మెల్యేలు నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాలతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్.. కిలోమీటరు మేర కంకర పోసి 15 రోజులు గడవకముందే పనులకు మంగళం పాడారు.

### నిలిచిన రవాణా.. నరకప్రాయం ప్రయాణం:

రోడ్డుపై పరచిన కంకర తేలడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాల టైర్లు జారి కిందపడి పలువురికి గాయాలవుతున్నాయి. ఈ మార్గంలో నడిచే బస్సులు సైతం నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు అల్లాడిపోతున్నారు. సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు మొరపెట్టుకున్నా ఫలితం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బీటీ పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో పోసిన కంకరనైనా తొలగించి తమను ఈ నరకం నుంచి రక్షించాలని వేడుకుంటున్నారు.



## మొక్కలతోనే మానవజాతికి రక్షణ

- యాదాద్రి గోశాలలో ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో హరితహారం
- మొక్కలు నాటిన దేవస్థాన చైర్మన్ నరసింహమూర్తి

**యాదగిరిగుట్ట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** పర్యావరణ కాలుష్యం నుంచి మానవజాతిని రక్షించే శక్తి ఒక్క మొక్కలకే ఉందని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్ బి.నరసింహమూర్తి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మంగళవారం యాదాద్రి గోశాల ఆవరణలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, కమాండెంట్ త్రినాథ్‌ల సూచనల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్పీఎఫ్ విభాగం ఇప్పటికే ఇక్కడ ఒక గార్డెన్‌ను అద్భుతంగా తీర్చిదిద్దిందని, దానిని మరింత విస్తరించడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకానికి ఎస్పీఎఫ్ పెద్దపీట వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

## ముఖ్యమంత్రికి సద్బుద్ధి ప్రసాదించాలని యాదాద్రీశుడికి పూజలు

- కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయని నిలదీసిన బీఆర్ఎస్ మహిళా నేతలు
- గుట్టలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, పద్మా దేవేందర్‌రెడ్డి ధ్వజం



**యాదగిరిగుట్ట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భగవంతుడు సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ బీఆర్ఎస్ మహిళా నేతలు మంగళవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని వేడుకున్నారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, కరీంనగర్ మాజీ జెడ్పీ ఛైర్మన్ తుల ఉమ తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా రైతు సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వారు విమర్శించారు. అన్నదాతలు అరిగోస పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రేవంత్‌రెడ్డి సర్కారు తీరు 'దోచుకో.. దాచుకో' అన్నట్లుగా ఉందని ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేలా ముఖ్యమంత్రికి జ్ఞానోదయం కలిగించాలని తాము స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజపేట అంటేనే ఆధ్యాత్మిక నిలయం

- గీతాజయంతి ఉత్సవాల జ్ఞాపకాలను నెమరువేసుకున్న విన్నకోట రమాకుమారి
- ఉప్పల పెద్ద పోచయ్య సేవలు అమూల్యం
- గాయని శోభారాణికి 'నారీ సేవా శిరోమణి' పురస్కారం



**రాజపేట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** అరవై ఏళ్ల నాటి ఆధ్యాత్మిక వైభవాన్ని, రాజపేట గీతాజయంతి ఉత్సవాల మధుర స్మృతులను ప్రముఖ హరిదాసు విన్నకోట రమాకుమారి గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో గ్లోబల్ ఫైనాన్స్ యోగా అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజపేటకు చెందిన ప్రముఖ గాయని పబ్బోజు శోభారాణికి 'గ్లోబల్ నారీ సేవా శిరోమణి' పురస్కారాన్ని అందజేసి అభినందించారు. శోభారాణి తనది రాజపేట అని పరిచయం చేసుకోగానే రమాకుమారి ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అర్ధ శతాబ్దం క్రితం రాజపేటలో జరిగిన గీతాజయంతి ఉత్సవాల్లో తాను సుమారు పదేళ్ల పాటు పాల్గొని హరికథా కాలక్షేపం చేసినట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. ఆనాడు ఉత్సవాల నిర్వహణలో ఉప్పల పెద్ద పోచయ్య చేసిన కృషిని, ఆయన అందించిన సేవలను కొనియాడారు. రాజపేట అంటేనే ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు నెలవని, ఆ ఊరి వారిని కలిసినప్పుడు తనకు ఎంతో సంతృప్తి కలుగుతుందని ఆమె ఆప్యాయంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొని పురస్కార గ్రహీతను అభినందించారు.

# ఏప్రిల్‌లోనే మూడు నెలల రేషన్ పంపిణీ







- లబ్ధిదారులు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలి
- తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ వెంకారెడ్డి

**వలిగొండ, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఏప్రిల్ మాసంలోనే పంపిణీ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ (పౌరసరఫరాలు) వెంకారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వలిగొండ మండలంలో పర్యటించి తహసీల్దార్ కార్యాలయం, గోదాములు, రైస్‌మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 2,50,789 రేషన్ కార్డుల పరిధిలోని 7,91,142 మంది యూనిట్లకు గాను మొత్తం 15,031.035 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించినట్లు వివరించారు. మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తున్నందున లబ్ధిదారులు తగినన్ని సంచులు, రవాణా సౌకర్యాన్ని చూసుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గన్ని గోదాము, బఫర్ గోదాము, పెట్రోల్ బంకు, వాసవి రైస్‌మిల్లులను సందర్శించి నిల్వలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీసీఎస్‌ఓ రోజారాణి, డీఎం హరికృష్ణ, డీటీ బాలమణి, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ దశరథ తదితరులు పాల్గొన్నారు.

## అక్షర సేద్యంలో 'తనూజ' చెరగని ముద్ర!

- లక్ష్మీ తనూజ.. ఆదర్శ ప్రధానోపాధ్యాయురాలు
- 43 ఏళ్ల సుదీర్ఘ సేవలు అభినందనీయం
- ఎంఈవో గురువారావు ప్రశంస
- దండు మల్కాపురంలో ఘనంగా పదవీ విరమణ సభ

**చౌటుప్పల్, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** నాలుగు దశాబ్దాలకు పైగా విద్యాబోధనలో ఉంటూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన లక్ష్మీ తనూజ అందరికీ ఆదర్శప్రాయురాలని చౌటుప్పల్ మండల విద్యాధికారి గురువారావు కొనియాడారు. మండల పరిధిలోని దండు మల్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (ఎఫ్.ఏ.సి) లక్ష్మీ తనూజ మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువారావు మాట్లాడుతూ.. లక్ష్మీ తనూజ 43 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి తెలుగు భాషా సంరక్షణ కోసం విశేష కృషి చేశారని ప్రశంసించారు. ఆమె క్రమశిక్షణ, బోధనా శైలి భావి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు ఆమెకు సన్మాన పత్రం సమర్పించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమెకు వీడ్కోలు పలికారు.



## మెంబర్‌షిప్ ఇవ్వండి.. ఆపై ఎన్నికలకు వెళ్లండి!

- కొత్త సభ్యత్వం కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి
- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు అన్యాయం చేయొద్దు
- ప్రభుత్వానికి పద్మశాలి సంఘం అధ్యక్షులు చిన్నం వెంకటరమణ విజ్ఞప్తి



**రాజపేట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** చేనేత, పవర్‌లూమ్ సహకార సంఘాల్లో అర్హులైన కార్మికులందరికీ కొత్తగా సభ్యత్వం కల్పించిన తర్వాతే ఎన్నికల నిర్వహణకు మొగ్గు చూపాలని రాజపేట పద్మశాలి సంఘం అధ్యక్షులు చిన్నం వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన రాజపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 13 ఏళ్లుగా సహకార సంఘాలకు ఎన్నికలు జరగలేదని, 2013 నుంచి ఇప్పటివరకు సభ్యత్వ నమోదు ప్రక్రియ నిలిచిపోవడంతో వేలాది మంది కార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘాల్లో సభ్యత్వం లేకపోవడం వల్ల ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రయోజనాలు, రాయితీలు అర్హులైన కార్మికులకు చేరడం లేదని వివరించారు. ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో, ముందుగా కొత్త సభ్యత్వానికి అవకాశం కల్పించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న వేలాది మంది చేనేత, పవర్‌లూమ్ కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## పంచాయతీ కార్మికులపై వేధింపులు అరికట్టాలి

- ఎంపీడీవో కార్యాలయం వద్ద సీఐటీయూ ధర్నా
- కొత్త పాలకవర్గాల తీరుపై కార్మిక సంఘం ఆగ్రహం

**వలిగొండ, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులపై ప్రజాప్రతినిధులు చేస్తున్న వేధింపులను తక్షణమే అరికట్టాలని గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్షులు కొండ నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి, అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. గ్రామాల్లో నూతనంగా కొలువుదీరిన సర్పంచులు, పాలకవర్గ సభ్యులు కార్మికులను వ్యక్తిగతంగా వేధిస్తున్నారని ఆరోపించారు. కొన్ని గ్రామాల్లో కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని, వేతనాల చెల్లింపులోనూ వివక్ష చూపుతున్నారని ఆయన మండిపడ్డారు. నచ్చిన వారికి జీతాలు ఇచ్చి, మిగిలిన వారికి నిలిపివేయడం ఏంటని ప్రశ్నించారు. కార్మికుల పట్ల ప్రజాప్రతినిధులు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పెడవెల్లి ఎల్లయ్య, రాజు, రాములు, పావురాల శీను, యాదయ్య, లక్ష్మమ్మ, వెంకటేశం, రాములమ్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

- ఆదుకున్న అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు వేముల సుధాకర్

**వలిగొండ, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు పులిగిల్ల గ్రామ నాయకులు ముందుకు వచ్చారు. మండల పరిధిలోని పులిగిల్ల గ్రామానికి చెందిన పల్లెర్ల నరసింహ ఇటీవల హఠాన్మరణం చెందారు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ పేద కుటుంబంలో యజమాని మరణంతో ముగ్గురు కుమార్తెలు, భార్య దిక్కులేని వారయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు, గ్రామ నాయకుడు వేముల సుధాకర్ మానవతా దృక్పథంతో స్పందించారు. మంగళవారం మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మంద విజయ్, పల్లెర్ల మల్లేష్, హరీష్, బిక్షపతి, కృష్ణ, జగన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకం.. మహిళలకు వరం!

- మహిళల స్వేచ్ఛా ప్రయాణం.. రాష్ట్రానికి గర్వకారణం
- విజయోత్సవ సభలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- బస్సు ఛార్జీల రూపంలో రూ.10,012 కోట్ల పొదుపు
- జిల్లాలో మహిళా సమాఖ్యలకు బస్సులు

**యాదాద్రి భువనగిరి, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** లరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల ఉచిత ఆర్టీసీ ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోందని, ఇది రాష్ట్రానికే గర్వకారణమని జిల్లా అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం భువనగిరి బస్‌స్టాండ్ ఆవరణలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఆదా చేసిన ప్రయాణ ఖర్చు రూ.10,012 కోట్లు దాటడం విశేషమన్నారు. ఉచిత బస్సు సౌకర్యంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో అందించే సేవలను కూడా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





## అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి

- మాదకద్రవ్యాలు, బెల్టు షాపుల నిర్మూలనకు సహకరించాలి
- పీపల్ పహాడ్‌లో సీ.ఐ మన్మథ కుమార్
- ఘనంగా మహిళా హక్కుల అవగాహన సదస్సు



**చౌటుప్పల్, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** సమాజానికి చేటు చేసే మాదకద్రవ్యాలు, బెల్టు షాపుల వంటి అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ సీ.ఐ మన్మథ కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పీపల్ పహాడ్ గ్రామంలో సీడీఈడబ్ల్యూ ఆధ్వర్యంలో మహిళల హక్కులు, దొంగతనాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ఆటంకంగా మారిన బెల్టు షాపులను నిర్మూలించడంలో మహిళలు ముందుండాలని కోరారు. సీడీఈడబ్ల్యూ ప్రతినిధి శ్రీవాణి మాట్లాడుతూ.. మహిళలు తమకు ఉన్న చట్టపరమైన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, వేధింపులకు గురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. దొంగతనాల నుంచి ఆస్తులను ఎలా రక్షించుకోవాలనే అంశంపై పోలీసుల సూచనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులనగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్, ఉప సర్పంచ్ బకనగారి శ్రవణ్ కుమార్, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత

- రామన్నపేటలో ముగిసిన వారం రోజుల 'అరైవ్ అలైవ్' ప్రచారం
- వాహనదారులకు పోలీసుల వినూత్న అవగాహన
- మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు
- హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరి: సీఐ, ఎస్ఐ



**రామన్నపేట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రామన్నపేట మండల కేంద్రంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026' మంగళవారంతో ముగిసింది. స్థానిక సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు, ట్రావెల్స్ యజమానులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ల డ్రైవర్లు సీటు బెల్టు ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ పత్రాలను కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ మాట్లాడటం ప్రాణాంతకమని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులు, తల్లిదండ్రులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదాల వల్ల ఎంతో మంది వికలాంగులుగా మారుతున్నారని, కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కోరారు.

## లో-వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- 12, 19 వార్డుల్లో 100 కే.వీ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం
- మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలోని 12, 19వ వార్డుల్లో నెలకొన్న విద్యుత్ లో-వోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. వార్డుల్లో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కే.వీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, కౌన్సిలర్లు పిల్లలమర్రి మధుసూదన్, పాక చిరంజీవిలతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్న గృహిణులు, విద్యార్థుల విన్నపం మేరకు ట్రాన్స్‌కో అధికారులతో చర్చించి యుద్ధ ప్రాతిపదికన వీటిని మంజూరు చేయించినట్లు తెలిపారు. 12, 19 వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని కౌన్సిలర్లు పిల్లలమర్రి మధుసూదన్, పాక చిరంజీవి పేర్కొన్నారు. వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వారు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సుర్వి నరసింహ, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, 12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి, మొగుదాల రమేష్ గౌడ్, ఎస్‌కే జానీ బాబు, దేప రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాబు, శ్రీకాంత్ గౌడ్, విద్యుత్ శాఖ ఏఈ సతీష్ కుమార్, వర్కాల రాము గౌడ్, ఇప్ప వెంకటేష్, మలిగే మల్లేష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ల చేతుల్లో వ్యవసాయ రంగం బందీ!






- కేంద్ర ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే జూలకంటి ధ్వజం
- రామన్నపేటలో ఉత్సాహంగా మహిళా రైతుల రాష్ట్ర సదస్సు
- జమ్మూకశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా రైతు పోరాటం సాగాలి: జూలకంటి

**రామన్నపేట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల దేశీయ వ్యవసాయ రంగం కార్పొరేట్ల కబంద హస్తాల్లో చిక్కుకుపోయిందని మాజీ ఎమ్మెల్యే, రైతు సంఘం జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలోని జేపీ గార్డెన్‌లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మహిళా రైతుల రాష్ట్ర సదస్సు ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 260 మంది మహిళా రైతు ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ముందుగా అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం, మహిళా రైతు కన్వీనర్ కందాల ప్రమీల సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి కేంద్రం చేసుకుంటున్న వాణిజ్య ఒప్పందాల వల్ల స్వదేశీ రైతులకు మద్దతు ధర కరువై దివాలా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన సవరణ బిల్లు ద్వారా విత్తన రంగాన్ని బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని, విద్యుత్ ప్రైవేటీకరణతో రైతులకు అందే సబ్సిడీలకు ఎసరు పెడుతున్నారని మండిపడ్డారు. మహిళా రైతులకు భూమిపై జాయింట్ పట్టాలు ఇవ్వాలని, ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా రైతుల సమస్యలపై పోరాట కార్యాచరణ రూపొందించి పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో రైతు సంఘం జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు అరిబండి ప్రసాద్, బొంతల చంద్రారెడ్డి, కందాల ప్రమీల, జిల్లా నాయకులు అశోక్ రెడ్డి, మాటూరి బాలరాజు, బొంతు రాంబాబు, వీటి వెంకటేశ్వర్లు, చీరిక అలివేలు, శీలం పకీరమ్మ, రంజిత తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడేదే నిజమైన విద్య

- ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం
- రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు
- ఐఏఎస్ హోదా పొందిన ఏనుగు నరసింహారెడ్డికి ఘన సన్మానం




**రామన్నపేట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** నేటి విద్యావిధానం కేవలం మార్కులు సాధించడానికే పరిమితమవుతోందని, సమాజంలో మార్పు తీసుకువచ్చేలా విద్యా సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం పేర్కొన్నారు. రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర, వాణిజ్య, భౌతికశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో 'ఉన్నత విద్యలో ఆవిష్కరణలు - సమకాలీన పురోగతి' అనే అంశంపై మంగళవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సదస్సు సంచికను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేలా ఉన్నత విద్యామండలి కృషి చేస్తోందన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు డాక్టర్ సిహెచ్. కృష్ణారెడ్డి కీలకోపన్యాసం చేస్తూ.. ఆధునిక కాలంలో మానవీయ బంధాలు అడుగంటిపోతున్నాయని, భారతీయ మూలాలు, సంప్రదాయాలను ప్రతిబింబించే విద్య నేటి తరానికి అవసరమని అన్నారు.




ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి (ఐఏఎస్) మాట్లాడుతూ.. ఏఐ, చాట్‌జీపీటీ వంటి సాంకేతికత వల్ల విషయ సేకరణ సులభమైందన్నారు. ఐఏఎస్ హోదా పొందిన సందర్భంగా ఆయనను కళాశాల బృందం ఘనంగా సన్మానించింది. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్ ఖానం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో 30 మందికి పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు.

## మిత్రుడి స్మృతిలో.. విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

- స్నేహితుడి జ్ఞాపకార్థం విద్యార్థులకు చేయూత
- కస్తూరిబా పాఠశాలలో ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ
- పోచంపల్లి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఉదారత



**భూదాన్ పోచంపల్లి, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** తోటి మిత్రుడి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ.. పేద విద్యార్థులకు అండగా నిలిచి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు భూదాన్ పోచంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. మిత్రుడు చక్రాల రామాంజనేయులు వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థినులకు పరీక్ష అట్టలను (ఎగ్జామ్ ప్యాడ్స్) అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తమ మిత్రుడి స్మారకార్థం ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భోగా భానుమతి, జెల్ల గోవర్ధన్, బోనగిరి దయానం, చిట్టిమల్ల లక్ష్మణ్, భారత భాస్కర్, చెరుకు రాములు, మాటూరు లక్ష్మీనారాయణ, తడక విష్ణు, తడక భాస్కర్, యన్నం శ్రీనివాస్, ఈపూరి శ్రీనివాస్, ఆదిమూలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## గురుకుల విజేతలకు అభినందనల నీరాజనం

- వెల్లంకి పాఠశాలలో విపంచి ఫౌండేషన్ చేయూత
- విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ
- పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ రాధా శ్రీనివాస్ హామీ

**రామన్నపేట, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** విద్యా కుసుమాలు వికసించాలనే లక్ష్యంతో వెల్లంకి ప్రాథమిక పాఠశాలలో విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులను మంగళవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుమల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు తమ వంతు చేయూతనిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను, ఫౌండేషన్ ప్రతినిధులను ఈ సందర్భంగా సత్కరించారు. గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇట్టె సోమిరెడ్డి, ఉయ్యాల బిక్షమయ్య, దూదిగామ సువర్ణ, మందుగుల వెంకటయ్య, కోసనం మాధవి, నకిరేకంటి అశ్విని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నిరాధార ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు

- పార్టీ సస్పెన్షన్ చెల్లదు: భారత వాసుదేవ్
- ఫోన్ హ్యాకింగ్‌పై న్యాయపోరాటం చేస్తానని వెల్లడి

**భూదాన్ పోచంపల్లి, మార్చి 31 (తొలివెలుగు న్యూస్):** తనపై వస్తున్న అసత్య ఆరోపణలను వెంటనే మానుకోవాలని, లేనిపక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని భూదాన్ పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షులు భారత వాసుదేవ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక సహకార సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన వార్డుల్లో అభ్యర్థుల ఓటమికి తనను బాధ్యుడిని చేస్తూ బలిపశువును చేయడం సరికాదన్నారు. తనకు బాధ్యత అప్పగించిన 12, 13 వార్డుల్లో అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలు శ్రమించానని గుర్తుచేశారు. రాష్ట్ర స్థాయిలో పీసీసీ అధ్యక్షులు మారిన తర్వాత పాత కమిటీలు రద్దవుతాయని, అటువంటప్పుడు అధికారం లేని వ్యక్తులు తనను సస్పెండ్ చేయడం చట్టరీత్యా చెల్లదని స్పష్టం చేశారు. తన వ్యక్తిగత సమాచారాన్ని ఫోన్ నుంచి హ్యాక్ చేయడం దుర్మార్గమని, దీనిపై న్యాయపరంగా పోరాడతానని తెలిపారు. పార్టీకి ద్రోహం చేశానన్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని, నిరాధార విమర్శలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ధ్వజమెత్తారు.





## హైదరాబాద్‌లో రూ.350 కోట్లతో లగ్జరీ హోటల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ హైదరాబాద్‌లో దాదాపు రూ. 350 కోట్లతో లగ్జరీ హోటల్‌ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. దీన్ని చాలెట్ హోటల్స్‌కి ప్రీ--లీజుకి ఇచ్చినట్లు తెలిపింది. 5.3 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఉండే ఈ ప్రాజెక్టులో 330 గదులు ఉంటాయి. 2027--28 నాలుగో త్రైమాసికంలో ఇది పూర్తయ్యే అవకాశం ఉందని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ తెలిపింది. ఇరు సంస్థల మధ్య ఒప్పందం ప్రకారం మైండ్‌స్పేస్ రీట్‌కి చెందిన స్పెషల్ పర్పస్ వెహికల్ సంస్థ సదరు ప్రాపర?టని స్థూలంగా నిర్మించి ఇస్తుంది. ఇంటీరియర్స్, హోటల్ నిర్వహణ మొదలైన పనులను చాలెట్ చేపడుతుంది. ప్రస్తుతం చాలెట్‌కి మొత్తం మీద 3,300 గదుల పోర్ట్‌ఫోలియో ఉంది. మైండ్‌స్పేస్ రీట్‌కి హైదరాబాద్‌తో పాటు ముంబై, పుణె చెన్నైలలో ఆఫీస్ అసెట్స్, బిజినెస్ పార్కులు ఉన్నాయి.

## ఐటీ కొత్త రూల్: ఇంటి ఓనర్‌తో సంబంధం చెప్పాలి




ఆదాయపన్ను ముసాయిదా పత్రాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటి అద్దెపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకునే వారు ఇకపై ఇంటి యజమానితో చేసుకున్న ఒప్పంద రుజువును చూపించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపన్ను చట్టం అమల్లోకి రానుండడం గమనార్హం. దీంతో ముసాయిదా పత్రాలు, నిబంధనలపై భాగస్వాములకు ఆదాయపన్ను శాఖ పంపిణీ చేసింది. వేతన జీవులు హెచ్‌ఆర్‌ఏ క్లెయిమ్‌ను చేసుకునే విషయంలో యాజమాన్యానికి ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఇకపై ఫారమ్ 124లో ప్రాపర్టీ యజమానితో ఉన్న సంబంధాన్ని (అసెసీ/పన్ను చెల్లింపుదారు/దాఖలుదారు) వెల్లడించాల్సి ఉంటుంది. కల్పిత, పెంచి చూపించే అద్దె మొత్తాలకు ఈ నిబంధన చెక్ పెడుతుందని పన్ను నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విదేశీ ఆదాయంపై పన్ను జమ క్లెయిమ్‌లకు సంబంధించి ఆడిటర్లు, కంపెనీలపై బాధ్యతను పెంచడం కూడా కొత్త పత్రాల్లో భాగంగా ఉంది. భారత్‌కు వెలుపల ఏదైనా ప్రాంతానికి సంబంధించిన ఆదాయంపై ఫారిన్ ట్యాక్స్ విత్‌హోల్డింగ్ సర్టిఫికెట్లను అకౌంటెంట్లు స్వతంత్రంగా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. చెల్లింపుల రుజువులు, కరెన్సీ మారకం లావాదేవీలు, పన్ను అర్హత నిబంధనలను, పన్ను చెల్లింపుదారు నివాస హోదాలను సైతం ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.

## కొంచెం రిస్క్ ఉన్నా.. లాభం రావాలంటే?



ఈక్విటీలలో థీమ్యాటిక్/సెక్టోరల్ ఫండ్స్ అన్నవి కొంచెం రిస్క్ ఉన్నా సరే, రాబడులు కూడా బలంగా ఉండాలని కోరుకునే వారికి అనుకూలంగా ఉంటాయి. ఇవి తాము ఎంపిక చేసుకున్న రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ మాత్రం భిన్నమైన, మెరుగైన పనితీరుతో ఆకర్షిస్తోంది. ఇన్వెస్టర్లు దీర్ఘకాల లక్ష్యాల పెట్టుబడుల్లో కొంత మొత్తాన్ని వైవిధ్యం కోసం కేటాయించుకోవాలని భావించేట్టు అయితే.. ఈ ఫండ్‌ను పరిశీలించొచ్చు. పథకం 2021 జనవరిలో ప్రారంభమై.. ఐదేళ్ల ట్రాక్ రికార్డును పూర్తి చేసింది. ఈ పథకం ఆరంభంలో రూ.లక్ష ఇన్వెస్ట్ చేసి ఉంటే అది రూ.2.51లక్షలుగా మారి ఉండేది. ఐదేళ్లలోనూ ఏటా 20.56 శాతం చొప్పున ప్రతిఫలాన్ని అందించింది. ఇదే కాలంలో నిఫ్టీ 500 టీఆర్ఐ రాబడి 15.47 శాతమే ఉండడం గమనార్హం. ఏడాది కాలంలో పెట్టుబడులపై 18 శాతం రాబడిని అందించింది. ఇక మూడేళ్ల కాలంలో చూస్తే వార్షిక రాబడి 22.82 శాతంగా ఉంది. ఇక ఇదే విభాగంలో ఇతర పథకాలతో పోటి?చతే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ ట్రాక్ రికార్డు పటిష్టంగా ఉంది. ఇన్వెస్టర్లు కనీసం రూ.100 నుంచి సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఆరంభం నుంచి ఈ పథకంలో ప్రతి నెలా రూ.10,000 చొప్పున సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసి ఉంటే రూ.6.10 లక్షలు ఐదేళ్లలో రూ.9.74 లక్షలుగా మారి ఉండేది. అంటే ఏటా 18.47 కాంపౌండెడ్ రాబడి (సీఏజీఆర్)కి సమానం. బిజినెస్ సైకిల్స్ అంటే.. కొన్ని వ్యాపారాలకు ఒక్కో సమయంలో డిమాండ్ బలంగా ఉంటుంది. ప్రస్తుతం మెటల్స్‌లో బంగారం, వెండి, అల్యూమినియం, రాగి ధరలు గణనీయంగా పెరగడం, ఈ రంగాల్లోని కంపెనీలు బలంగా లాభాలు ఆర్జించడం చూస్తూనే ఉన్నాం. ఇలాంటి సైకిల్స్‌ను ఈ ఫండ్ ముందే గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంటుంది. స్థూల ఆర్థిక పరిస్థితులకు (ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, వృద్ధి గమనం, ద్రవ్య పరిస్థితులు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు) అనుగుణంగా ప్రయోజనం పొందే రంగాలను, థీమ్యాటిక్ అవకాశాలను ముందే గుర్తించి, ఆయా రంగాల్లోని బలమైన కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంది. తద్వారా దీర్ఘకాలంలో ఇన్వెస్టర్ల పెట్టుబడులను వృద్ధి చేయడం ఈ పథకం ఉద్దేశం. పరిస్థితులకు అనుగుణంగా విదేశీ స్టాక్స్‌లోనూ ఇన్వెస్ట్ చేస్తుంది.

# తగ్గిన దేశ వృద్ధిరేటు.. కొత్త సిరీస్‌లో జీడీపీ గణాంకాలు విడుదల

**అక్టోబర్–డిసెంబర్‌లో 7.8 శాతంగా నమోదు**

**అంతకుముందు త్రైమాసికంలో 8.4 శాతంగా రికార్డు**

**ఈ ఆర్థిక సంవత్సరం 7.6 శాతంగా అంచనా**




న్యూఢిల్లీ: దేశ జీడీపీ వృద్ధిరేటు తగ్గుముఖం పట్టింది. పాత సిరీస్‌ను కాదని, కొత్త సిరీస్‌ను తెచ్చి లెక్కించినా.. భారతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న నిస్తేజాన్ని దాచలేకపోయింది నరేంద్ర మోదీ సర్కార్. ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికం (అక్టోబర్–డిసెంబర్)లో ఆర్థిక ప్రగతి రేటు 7.8 శాతంగానే ఉన్నట్టు తేలింది మరి. అంతకుముందు త్రైమాసికం (జూలై–సెప్టెంబర్)తో పోల్చితే 0.6 శాతం పడిపోయింది. నాడు 8.4 శాతంగా ఉన్నది. శుక్రవారం కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ.. 2022–23 బేస్ ఇయర్ (ఆధారిత సంవత్సరం)తో నూతన వార్షిక, త్రైమాసిక జాతీయ పద్దు అంచనాల సిరీస్‌ను విడుదల చేసింది. ఇప్పటిదాకా ఉన్న 2011–12 బేస్ ఇయర్ జీడీపీ గణన సిరీస్ స్థానంలో దీన్ని తీసుకొచ్చింది. కాగా, జీడీపీ గణనకు బేస్ ఇయర్‌లను ఇలా సవరించడం ఇది తొమ్మిదోసారి.

**ఇదీ సంగతి..**

కొత్త సిరీస్‌తో దేశ జీడీపీ లెక్కింపు పద్ధతిని కేంద్రం సవరించింది. బేస్ ఇయర్‌ను మార్చడమేగాక, దేశంలోని ఆర్థిక కార్యకలాపాలన్నీ ప్రతిబింబించేలా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), ఈ–వాహన్ పోర్టల్‌ల డాటానూ జీడీపీ గణనకు అనుసంధానం చేశారు. ఇంతకుముందు జీఎస్టీ, ఈ–వాహన్ పోర్టల్ డాటా.. జీడీపీ లెక్కింపు పరిధిలోకి వచ్చేది కాదు. ఇదిలావుంటే కొత్త సిరీస్ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం జీడీపీ గణాంకాలను కేంద్రం సవరించింది. పాత సిరీస్ ప్రకారం 8.2 శాతంగా ఉంటే.. ఇప్పుడది 8.4 శాతానికి పెరిగింది. దీంతో చూస్తే.. అక్టోబర్–డిసెంబర్ జీడీపీ వృద్ధిరేటు 0.6 శాతం పడిపోయి 7.8 శాతానికే పరిమితమైంది. అయితే గత ఆర్థిక సంవత్సరం (2024–25) అక్టోబర్–డిసెంబర్‌తో పోల్చితే మాత్రం పెరిగింది. అప్పుడు 7.4 శాతంగా ఉన్నది. ఇక ఈసారి తయారీ, సేవా రంగాల్లో వృద్ధి కనిపించినట్టు కేంద్రం చెప్తున్నది.

**ఈసారి 7.6 శాతం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతంగా నమోదు కావచ్చని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. పాత సిరీస్‌లో ఈ అంచనా 7.4 శాతంగానే ఉన్నది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 7.1 శాతంగా నమోదైన సంగతి విదితమే. కాగా, జీడీపీ గణనలో బేస్ ఇయర్ మార్పుతో దేశంలోని ఆర్థిక కార్యకలాపాల అసలు విలువ మరింత స్పష్టంగా తెలుస్తుందని మోదీ సర్కార్ భావిస్తున్నది. అందుకే మొత్తం ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాను పెంచింది. ఇక ఈ 2025–26లో దేశ జీడీపీ విలువ రూ.322.58 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా. 2024–25లో రూ.299.89 లక్షల కోట్లుగా ఉన్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ చెప్తున్నది.

వచ్చేసారి 7–7.4% : సీఈఏ

వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) దేశ జీడీపీ వృద్ధిరేటు 7–7.4 శాతంగా ఉండొచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ అంచనా వేశారు. అయితే గత నెల జనవరిలో కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో మాత్రం ఈ అంచనా 6.8–7.2 శాతంగానే ఉన్నది. జీడీపీ గణనకు కొత్త సిరీస్ విడుదలైన నేపథ్యంలో ఇదిప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. కాగా, దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4 లక్షల కోట్ల డాలర్ల మార్కును కూడా దాటగలదన్న విశ్వాసాన్ని కొత్త సిరీస్ ప్రకటన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వ్యక్తం చేశారు.

# జీసీసీలకు డిమాండ్ భళా



**గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు/జీసీసీలు) ఏర్పాటుకు అమెరికా కంపెనీలు భారత్‌ను ఎంతో కీలకంగా చూస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో 2020 నుంచి 2025 మధ్య హైదరాబాద్ సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో.. 101 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) కార్యాలయ వసతులను జీసీసీల ఏర్పాటుకు విదేశీ సంస్థలు లీజుకు తీసుకోవడం గమనార్హం. ఈ కాలంలో మొత్తం ఆఫీస్ లీజింగ్ 280.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్టు రియల్ ఎస్టేట్‌రంగ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా తెలిపింది.**

బెంగళూరు, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, కోల్‌కతా, ముంబై, పుణె నగరాల డేటా ఆధారంగా ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నగరాల్లో మొత్తం ఉపాధి డిమాండ్‌లో 36 శాతం జీసీసీల నుంచే వస్తున్నట్టు తెలిపింది. గత ఐదేళ్లలో 101 మిలియన్ ఎస్ఎఫ్‌టీల జీసీసీల లీజింగ్‌లో 71 మిలియన్ ఎస్ఎఫ్‌టీని అమెరికా కంపెనీలు తీసుకున్నాయి.'భారత ఆఫీస్ మార్కెట్ ఇటీవలి సంవత్సరాల్లో పెద్ద ఎత్తున విస్తరించింది. కరోనా అనంతరం డిమాండ్ ఎప్పటికప్పుడు గరిష్టాలకు చేరుతోంది. ముఖ్యంగా జీసీసీలు ఈ విస్తరణకు చోదకంగా ఉన్నాయి. వ్యయాలు ఆదా చేసుకునే కేంద్రాలుగా కాకుండా.. ఆవిష్కరణల ఆధారిత అంతర్జాతీయ అనుసంధాన విజ్ఞాన, పరిశోధన కేంద్రాలుగా అవతరించాయి' అని కొలియర్స్ ఇండియా తెలిపింది.

**ఏటా 35--40 మిలియన్ ఎస్ఎఫ్‌టీ**

2025లో విదేశీ సంస్థలు భారత్‌లో 29.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీలను తీసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం గమనార్హం. ఈ ఏడు నగరాల్లో స్థూల ఆఫీస్ లీజింగ్ 71.5 మిలియన్ ఎస్ఎఫ్‌టీలో ఈ మొత్తం 41 శాతంగా ఉంది. విదేశీ సంస్థలు భారత్‌లో జీసీసీల ఏర్పాటుకు ఏటా 35--40 మిలియన్ ఎస్ఎఫ్‌టీని లీజుకు తీసుకుంటాయని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర?వసెస్ ఎండీ అరి?పత్ మెహరోత్రా అంచనా వేశారు. "యూఎస్ సంస్థల నుంచి టెక్నాలజీ ఆధారిత జీసీసీల ఏర్పాటు డిమాండ్ స్థిరపడొచ్చు. ఐరోపా సమాఖ్య, బ్రిటన్‌కు చెందిన సంస్థల నుంచి ఇంజనీరింగ్, తయారీ, బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్‌కు సంబంధించి జీసీసీల ఏర్పాటుకు డిమాండ్ పెరుగుతుంది"అని చెప్పారు. ఈ నివేదికపై భివ్ వర్క్‌స్పేస్ వ్యవస్థాపకుడు, సీఈవో సురేష్‌రావు పప్లికర్ స్పందిస్తూ.. భారత నైపుణ్యాలు, బిజినెస్ ఎకోసిస్టమ్ పట్ల అంతర్జాతీయ కంపెనీల్లో విశ్వాసానికి నిదర్శనమన్నారు. కోవర్కింగ్ సెంటర్లలో ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్‌ను జీసీసీల కోసం తీసుకోవడం పెరిగినట్టు చెప్పారు. భారత్‌పై దీర్ఘకాల దృష్టితో యూఎస్, యూరప్, బ్రిటన్ కంపెనీలు జీసీసీల ఏర్పాటుకు ఆఫీస్ వసతులను లీజుకు తీసుకోవడం పెరిగినట్టు 'స్పేస్‌వన్' ప్రాపర్టీ యాక్విజిషన్ విభాగం డైరెక్టర్ సిజోజోస్ తెలిపారు.



## వినియోగంలో లేని పీఎఫ్ ఖాతాల్లో డిపాజిట్ల రిఫండ్

వినియోగంలో లేని (ఇనాపరేటివ్) దాదాపు ఏడు లక్షల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాల్లోని సుమారు రూ.30.52 కోట్ల మొత్తాన్ని రిఫండ్ చేయడంపై ఈపీఎఫ్‌వో దృష్టి పెడుతోంది. సదరు ఖాతాదారులు లేదా వారి లీగల్ వారసులకు త్వరలో బదిలీ చేయనున్నట్లు కార్మిక శాఖ వర్గాలు తెలిపాయి. రూ.1,000 వరకు బ్యాలెన్స్ ఉన్న 7.11 లక్షల ఖాతాలను సెటిల్ చేయాలని కార్మిక, ఉపాధి శాఖ ఒక సమీక్షలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించాయి. ఉద్యోగి లేదా కంపెనీ నుంచి 36 నెలలకు పైగా ఎలాంటి జమ లేని పీఎఫ్ ఖాతాలను ఇనాపరేటివ్‌గా పరిగణిస్తారు. సంబంధిత వర్గాల ప్రకారం 31.86 లక్షల ఇనాపరేటివ్ ఖాతాల్లో మొత్తం రూ. 10,903 కోట్లు ఉన్నాయి. వాటిలో రూ. 1,000 లేదా అంతకన్నా తక్కువ బ్యాలెన్స్ ఉన్న అకౌంట్లు ఏడు లక్షలు ఉన్నాయి. ఆధార్‌తో అనుసంధానమైన ఈపీఎఫ్ ఖాతాలున్న వారి బ్యాంకు ఖాతాలకు ఈ మొత్తాలను తక్షణం బదిలీ చేయనున్నారు.

## రిటైల్ రుణాలు రూ.162 లక్షల కోట్లు

రిటైల్ రుణాలు గణనీయమైన వృద్ధిని చూస్తున్నాయి. 2025 డిసెంబర్ త్రైమాసికంలో 18 శాతం పెరిగి రూ.162 లక్షల కోట్లకు చేరాయి. ముఖ్యంగా బంగారం ధరలు పెరగడంతో, వాటిపై రుణాలకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుండడం.. అలాగే, పండగల సీజన్, జీఎస్టీ రేట్ల తగ్గింపు రుణ వితరణ పెరిగేందుకు దారితీసింది. ఈ వివరాలను క్రెడిట్ సమాచార సంస్థ క్రిఫ్ హై మార్క్ విడుదల చేసింది. రిటైల్ రుణాల్లో అతిపెద్ద విభాగమైన గృహ రుణాలు 10.5 శాతం పెరిగి రూ.43 లక్షల కోట్లకు చేరాయి. ఈ విభాగంలో యాక్టివ్ రుణాలు నికరంగా 3.3 లక్షలు పెరిగాయి. వ్యక్తిగత రుణాలు సైతం 11.6 శాతం వృద్ధితో రూ.15.9 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఆటో రుణాలు 14.6 శాతం, ద్విచక్ర వాహన రుణాలు 12.3 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ రుణాలు 14.3 శాతం చొప్పున పెరిగాయి. సోల్ ప్రొప్రైటర్ సంస్థలు (ఒక్కరే యజమానిగా ఉన్న) తీసుకున్న రుణాలు 26.2 శాతం పెరిగాయి. రిటైల్ రుణాల వసూలు కూడా మెరుగుపడింది. 30 నుంచి 180 రోజుల వరకు చెల్లింపుల్లేనివి (మొండి బకాయిలు) డిసెంబర్ చివరికి 2.8 శాతానికి తగ్గాయి.